# సాఫల్యం

ఇందిరకు నిద్ర పట్టడంలేదు.

బాబాయి వాళ్ళింట్లో గడియారం రెండు గంటలు కొట్టింది. పక్కన నులకమంచం మీద నిద్ర పోతోంది అమ్మ. కుడిచేతివైపు తడిక, దానికి అవతలివైపు నాయనమ్మ పడుకుని వుంది. అదే బాబాయీవాళ్ళ వాటా. బాబాయి ప్రైమరీ స్కూల్లో టీచరు.

ఎడమవైపు వాటా పెదనాన్న వాళ్ళది. ఆయనా, ఆయన సంతానం ఐదుగురు పిల్లలూ-హైదరాబాద్‌లో వుంటారు. వాళ్ళకి సిరీ సంపదా కూడా పెద్దచూపు చూసినై. అది రెండు గదుల వాటా, అందులో అద్దెకున్నవాళ్ళు-రాఘవన్, ప్రమీల. ఇద్దరూ కొత్త దంపతులు. అతను ఏదో కంపెనీలో టైపిస్టు. ఆమె మరోచోట గుమాస్తాగా చేస్తోంది. వాళ్ళ పెళ్ళయి నెల కూడా కాలేదు.

ఈవైపు-రాఘవన్, ప్రమీల ! వాళ్ళ సరసాలు, సరాగాల సవ్వాళ్ళని భరించలేకుండా వుంది, ఇందిర !

ఆవైపు-నాయనమ్మ గురకపెడుతోంది. తొంభై ఏళ్ళు నిండినా ఈ ముసలిదానికి ఇంత నిద్రేమా అనిపించింది, ఇందిరకు.

తొంభై ఏళ్ళు ! ఎంత సుదీర్ఘమైన ప్రయాణం చేసింది, మామ్మ !

తనని ఇవాళ పట్టిపీడిస్తున్న ప్రశ్న ఈ తొంభై ఏళ్ళల్లోనూ ఏనాడన్నా మామ్మకి ఎదురయి వుంటుందా ?

ఇందిరకు నవ్వొచ్చింది. ఇలాంటి సందేహాలు వచ్చి వుంటే-ఏనాడో చచ్చివుండేది ఆవిడ !

సాయంత్రం వీధి గుమ్మంలో కూచుని బాదం ఆకుల విస్తరి కుడుతోంది తను. చాలా ఆతృతగా పత్రిక చదువుతూ యింటికి వస్తోంది సావిత్రి. పత్రిక అడుగున వొక చేతిలో పుస్తకాల దొంతర ! ఒక వంద గజాల దూరంనుంచే తనకు ఆమె కనిపిస్తోంది. సావిత్రి బాబాయిగారి నాలుగో కూతురు. ఆ పిల్ల ఈ యేడే కాలేజీలో చేరింది ; వాళ్ళ నాన్న మాటల్లో చెప్పాలంటే-పదో క్లాసుని అత్తెసరు మార్కులతో అయిందనిపించింది ఆమె.

సావిత్రి ఇంటిదగ్గర కొచ్చింది. దాని వాలకం చూసి ఆశ్చర్యం వేసింది తనకు. “ రోడ్డువెంట వస్తూ కూడా

చదువుకుంటూ రావాలిచే సావిత్రీ. అంత మునిగిపోయే విషయాలేం వుంటై అందులో! తీరిగ్గా ఇంట్లో కొచ్చాక కూచుని చదువుకోవచ్చుగా" అని అడిగింది.

సావిత్రి తన లోకంనుంచి బయటికి రాలేదు. అయినా, సమాధానం చెప్పింది. "ఈ సస్పెన్స్ నీకు తెలీదులే అక్కా, సీరియల్ చదివేవాళ్ళ అవస్థ సీరియల్ చదివే వాళ్ళకే తెలుస్తుంది. అన్నట్టు ఈ సీరియల్ పేరేమిటో తెలుసా–జీవితం ఏమిటి?"–

చూపులు తనవైపు తిప్పి చిత్రమైన విన్యాసంతో–"అయినా సీరియల్ అంటేనే తెలీదు నీకు; జీవితం ఏవిటి అంటే ఏం చెప్తావులే" అంటూ వాళ్ళ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

తను గ్రమాన్పడిపోయింది.

అవును–జీవితం అంటే ఏవిటి?

దీన్ని గురించే తను సాయంత్రం నుంచీ ఆలోచిస్తోంది.

గడియారం మరో అర్ధగంట గడిచిందంటూ ఒకసారి టంగుమంది.

ఇందిరకు నిద్ర పట్టడంలేదు.

గాజులు శబ్దమైనయ్. ప్రమీల అటూ ఇటూ కదిలినట్లు అలికిడవుతోంది.

మామ్మ గురక సాగుతోంది.

మధ్యలో ఇందిర మనస్సూ, శరీరమూ కాలిపోతున్నై.

నీరసంగా లేచి మంచంమీద కూర్చుంది. తలనొప్పిగా వుంది. మనసంతా వికలం అయిపోతోంది.

ఈ నాలుగేళ్ళనుంచీ జరిగిందంతా గుర్తుకొచ్చింది ఇందిరకు.

నా లు గే ళ్ళ క్రితం నరసింహం వుండేవాడు. తాను అప్పుడప్పుడు సిల్క్ చీరెలు కట్టుకొనేది. సాయంత్రాలు తలలో మల్లెలు తురుముకొని, వేణుగోపాలస్వామి గుడికి వెళ్ళి కాసేపు ప్రశాంతంగా కూర్చుని వచ్చేది. నవగ్రహాలకి ప్రదక్షిణచేసి-తన కడుపున వో కాయ కాసేట్టు దీవించమని కోరుకునేది. వెన్నెల రాత్రుల్లో అమృతాన్నీ, చీకటి రాత్రుల్లో నరసింహం మాటల్లో ధైర్యాన్నీ-చవిచూస్తూ వుండేది.

నరసింహం పోయాడు-హఠాత్తుగా, గుండె జబ్బు వుండేదనీ, కాదనీ ఏవేవో మాటలు, జరిగిందేవిటో తెలిసేసరికి తను దీపపు సెమ్మెగా మిగిలిపోయింది. ఆయనగా మిగిల్చి పోయింది ఏఁవీ లేలలేదు. అన్నయ్యే దినవారాలు కానిచ్చి తనని తెచ్చి ఇక్కడ పడేశాడు. పన్నెండో ఏట జరిగిన పెళ్ళికి పర్యవసానం-తను పాతికేళ్ళు నిండకుండానే రుచి చూసింది. ఇవాళ తను ఏకాకి.

ఇందిరలో రొద, వేడి, అస్థిమితత్వం, నిస్పృహ, నీరసం.

లేచి మంచినీళ్ళు తాగి మళ్ళీ పడుకుంది. నిద్ర పట్టడంలేదు. ఈవైపు శబ్దాలు నిశ్శబ్దంలో పరవశిస్తున్నై. ఆవైపు మామ్మ గురక మాత్రం తన తపనని మధిస్తోంది.

అవును—జీవితం ఏఁవిటి ?

అమ్మా తనూ ఇలా ఈ మధ్య వాటాలో, కాకుల్లా ముడుచుకు పడుకోవడమేనా ?

ఆరువందల మైళ్ళకి అవతల, తన సంసారంతో తాను సతమతమవుతూ, బాధ్యతని నెత్తిన వేసుకున్నందుకు తప్పని సరిగా, నెల నెలా పంపే-రెండు వందలతో-కూడా గుడ్డా గడుపుకోవడమేనా ?

అక్కయ్య కూతురో, చెల్లెలి కొడుకో-అడపా దడపా-చుట్టపు చూపుగా వస్తే, వాళ్ళని ముద్దుచేసి ఏ బిస్కెట్ పాకెట్టో ఇచ్చి పంపుతూ వుండటమేనా ?

తండ్రి బతికిన బతుకును తలచుకుంటూ, ఆ రోజుల్లో తాను తాగిన నేతుల కతల్ని మననం చేసుకుంటూ, అన్నయ్యనీ, తననూ, తన సంతానాన్ని అందర్నీ తిడుతూ, సాధిస్తూ, వేధిస్తూ-ఉబ్బసంతో తీసుకుంటున్న అమ్మని కనిపెట్టుకుని వుండి, ఆమె కష్టాని కడతేర్చడమేనా ?

ఏఁవిటి ? — జీవితం ఏఁవిటి ? —

ఇందిరకు గుండె బరువెక్కింది. లేచి దొడ్డి తలుపు తెరచుకుని పెరట్లోకి వచ్చింది.

రాత్రి చల్లగా వుంది. వెన్నెల కురుస్తోంది. గోడ పక్కగా వున్న పారిజాతం పూలని రాలుస్తోంది ; పరిమళాన్ని పరుస్తోంది.

నూతి చప్టామీద కూర్చుంది, ఇందిర. చల్లటి గాలి సోకింది. ప్రాణం లేచి వచ్చినట్లైంది. ప్రకృతి ఆమెను సలుపుతున్న

పుంతుమీద నవనీతాన్ని అద్దింది. ఆమెలోని సంఘర్షణ తాత్కాలికంగా వేగాన్ని తగ్గించుకుంది.

గడియారం నాలుగు కొట్టింది.

పెరటికి పడమరవైపు చంద్రమౌళిగారి ఇల్లుంది. ఆ యింటికీ, తమ యింటికీ మధ్య ఈతచెట్ల కంచే అడ్డం. వాళ్ళ దొడ్లో బావి దగ్గర అలికిడి అయింది. "రామదాసు లేచినట్లున్నాడు" అనుకుంది ఇందిర. చంద్రమౌళి తండ్రి రామదాసు. తెల్లవారు ఝామున నాలుగు గంటలకే లేచి స్నానాదులు ముగించుకుని పూజలో కూర్చోవడం ఆయన దినచర్యలో మొదటి అధ్యాయం. పరమనిష్ఠాగరిష్ఠుడుగా ఆయనకి ఆ వూళ్ళో మంచి పేరు. శుభలగ్నాలు నిర్ణయించడంనుంచీ సాయంత్రాలు గుళ్ళో పురాణ పఠనం వరకూ ఆయనకు ఎడతెగని కార్యక్రమాలు.

ఏదో అలికిడైనట్లయింది.

ఉలిక్కిపడి పక్కకు చూసింది ఇందిర. అమ్మ! కళ్ళు నులుముకుంటూ వచ్చింది "ఏవిటే ఇక్కడ కూర్చున్నావ్ ?" అడిగింది "ఊరికే" అని క్షణం ఆగి తల్లివైపు చూస్తూ— "జీవితం ఏవిటే అమ్మా ?" అంది.

పార్వతమ్మ విస్తుపోయింది. కూతురుకేసి కళవళంగా చూసింది. ఒక్క అడుగు వెనక్కి వేసింది. నిమ్మళంగా సాగి, బావిలో చేద వేస్తూ చెప్పింది.

"పిచ్చిపిల్లా ఏమిటో ఆలోచిస్తున్నావా ?" అనునయంగా అని "చూడు ఇందిరా, ఆ రామదాసుగారికి స్నానపానాగులూ, సంధ్యా, పూజా పునస్కారాలూ, వేదపఠనం, పురాణం చెప్పడం సప్తాహాలు చేయించడం-అదీ జీవితం. ఆ య న కొడుక్కి-క్లబ్బులూ, పేకాట, మగసిరికి తార్కాణంగా ఊరూరా ఓ ఆడదీ, లం చా లు పట్టి సంపాదించిన డబ్బుని గుర్రప్పందేలకూ, జూదాలకూ హోటళ్ళకూ పోయడం—అదీ జీవితం. వాళ్ళావిడ-దుర్గాంబకి—దయ్యాలూ, మంత్రాలూ, తంత్రాలూ, బడితె పూజలూ-అదీ జీవితం."

చెప్పడం ఆపింది. నూతిలో చేద లాగుతూ మళ్ళీ అన్నది, పార్వతమ్మ. "మీ మామ్మకు సుష్టుగా తిని, మస్తుగా గుర్రుపెట్టి నిద్రపోవడం ; సావిత్రికి సినిమాలూ నవలలూ-అదీ జీవితం" ఆమెకు దగ్గొచ్చింది. మాటలు ఆపి, చెంబుతో నీళ్ళు తీసుకుని మరోవేపుకు కదిలింది, మొహం కడుక్కోవడానికి.

తానూ లేచి పనుల్లో పడింది. ఇందిర బోనులో తిరుగుతున్నట్టు ఆ పూటల్లా మామూలు పనులతోనూ, పొడి పొడి మాటలతోనూ కాలక్షేపం చేసింది ఇందిర.

మధ్యాహ్నం రెండవుతుండగా విశ్వనాథం వచ్చాడు. ఆయన పార్వతమ్మకి అన్నకొడుకు. రెండేళ్ళ క్రితం ఆయన భార్య పోయింది. అప్పుడు తల్లి వాళ్ళ వూరు వెళ్ళి పలకరించి రావడం అవీ ఇందిరకు తెలుసు.

విశ్వనాథంకి నలుగురు మొగ పిల్లలూ, ఒక చిన్న ఆడపిల్లా వున్నారు. అందరికన్నా పెద్దవాడు బి టెక్ చదువుతున్నాడు. ఆయన వయస్సూ రేపో మాపో యాభయ్యో ఏడులో పడబోతోంది. ఆయనెక్కడో హైస్కూల్లో హెడ్మాస్టరు.

ప్రసంగవశాత్తూ తల్లికి చెప్పేడు, తను మళ్ళీ పెళ్ళి చేసుకోబోతున్నట్టు. పిల్లలతో ఇబ్బందిగా వుందట. ఆయన నిర్ణయానికి తల్లి కూడా సంతోషించింది.

ఓ గంటసేపు కూర్చుని వెళ్ళిపోయాడు విశ్వనాథం. వెళ్ళేముందు తనకు కాబోయే భార్య గురించిన వివరాలు చెప్పి, అమ్మచేత "అంతా బాగుంది" అనిపించుకుని వెళ్ళాడు.

ఇందిరను సావిత్రి ప్రశ్నే వెంటాడసాగింది.—"జీవితం ఏఁవిటి ?"

తన పరిస్థితి తనకు అసందర్భంగా తోచసాగింది, ఇందిరకు.

ముందు గదిలో చాప వేసుకుని నడుం వాల్చబోతుండగా వచ్చింది ప్రమీల. లేచి ఆమెను ఆహ్వానించింది ఇందిర.

ప్రమీల కూర్చుంది. ఆమెకేసి తేరిపార చూసింది ఇందిర. తలంటి పోసుకుని వదులుగా జడ వేసుకుంది. కనకాంబరం రంగు సిల్కుచీరె, అదేరంగు జాకెట్ ఆమె అందానికి మెరుగులు దిద్దుతున్నై.

" ఇవ్వాళ మాకు సెలవు ; మావారికి ఆఫీసుంది. పైగా ఈరోజు నా పుట్టినరోజు అందుకనే ఇంట్లో వున్నాను." ప్రమీలే మాట కలిపింది. ఇందిర కళ్ళు మెరిసిన్నై. ఆ మెరుపులోనే అభినందనల్ని అందుకుంది ప్రమీల. " ఎన్నో పుట్టిన రోజో అడగరేం " అంది ప్రమీల చిత్రంగా నవ్వుతూ. "చెప్పండి" అంది ఇందిర. 'ఈమె చిత్రమైన మనిషి' అనుకుంది మనసులో.

" ఇరవై నాలుగు " చెప్పింది ప్రమీల. ఆ వెంటనే అడిగింది, " మీ కెన్నేళ్ళు ? "

ఇందిర గతుక్కుమంది. "పాతిక" అంది, యధాలాపంగా.

క్షణాల తర్వాత, ఆరోజు తాను ఏమేమి తినుబండారాలు చేసిందీ చెప్పింది-ప్రమీల. తన భర్తతో సాయంత్రం సినిమా ప్రోగ్రాం వేసుకున్న పైనమూ, వాళ్ళ అన్నయ్య పంపిన బహుమతి డబ్బు సంగతీ-అన్నీ గలగలా కలుపుగోలుగా చెప్పింది. ప్రమీల స్నేహశీలత ఆహ్లాదాన్ని గొలిపింది, ఇందిరకు.

తనముందు జరుగుతున్నదంతా ఒక చలన చిత్రంలా తోచింది యిందిరకు. ఆశ్చర్యంగా ప్రమీల మాటలు వింటూ కూర్చుంది. అనేకమైన ఆలోచనలూ, గతస్మృతులు ఆమె మనస్సులో గజిబిజిగా అల్లుకోసాగిన్నై, వున్నట్టుండి, 'సావిత్రి ప్రశ్నను ప్రమీల వడిగితే ?' అనే ఆలోచన స్ఫురించింది-యిందిరకు. కొద్దిసేపు తటపటాయించి, చివరికి ధైర్యం తెచ్చుకుని అడిగేసింది.

గలగలా నవ్వింది ప్రమీల " తెర తీయగానే నాటకం ముగింపు చెప్పమని అడిగినట్లుంది మీ ప్రశ్న" అంటూ అంతలోనే గంభీరంగా మౌనం దాల్చింది.

" మీ రెండుకు చదువుకోకూడదూ ? " వున్నట్టుండి సీరియస్‌గా అడిగింది ప్రమీల.

త్రుళ్ళిపడింది ఇందిర. పక్కనే పిడుగు పడినట్లనిపించింది. అంతలోనే తాను ఏదో ముళ్ళకంచెను దాటేందుకు ఈ మనిషి ఓ నిచ్చెన వేస్తున్నట్టూ అనిపించింది.

" అవును. సాయంకాలాల్లో నాకు కాస్త కాలక్షేపంగా వుంటుంది. ఆయన వచ్చే వరకూ నాకు తీరికే, మీకు తెలుసుగా. మా ఆఫీసు నాలుగు గంటలకే అయిపోతుంది. తను వచ్చేసరికి ఎంత లేదన్నా ఏడవుతుంది " అంది ప్రమీల.

ఇందిర మాట్లాడలేకపోయింది. ఏదో అవ్యక్తమైన ఆప్యాయతా, ఆరాధనా కూడిన భావంతో ప్రమీలకేసి చూస్తూ వుండిపోయింది.

— నెల రోజుల తర్వాత,

ఓ సాయింత్రం—

ఇందిరకు యింగ్లీషు పాఠం చెప్తూ అడిగింది, ప్రమీల " మా అన్నయ్య శేఖర్ గురించి నీకు చెప్పాను కదా ? వాడి

బొమ్మని నీకు పూర్తిగానే వివరించాను వాణ్ణి గురించి నీ వుద్దేశం ఏవిఁటి ?" అని వో క్షణం ఆగి తలెత్తి "తను నిన్ను పెళ్ళిచేసుకుంటాడట !" అంది ప్రమీల.

యిందిర నిర్ఘాంతపోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. గోడకు వాలిపోయింది. ఒక్క క్షణం వర్షంలో తడుస్తున్న అనుభూతి కలిగిందామెకు.

— ఆ రాత్రి,

విశ్వనాధమూ, చంద్రమౌళీ, తన భర్తా కళ్ళముందు మెదిలారు యిందిరకు. ఆ తర్వాత శేఖర్ రూపం కళ్ళముందు నిలిచింది. ప్రమీల మాటలు గుర్తుకొచ్చినై. ఆమె సాన్నిహిత్యం తనను ఏదో అఖాతం నుంచి పైపైకి రమ్మని చేయందిస్తున్నట్టు అనిపించింది.

సావిత్రి ఎద్దేవా చేసిన ముల్లూ కలుక్కుమంది, మనస్సులో.

సీరియల్ అంటే ఏఁవిటో తెలిసినట్లయింది.

అక్కయ్య కూతురూ, చెల్లెలి కొడుకూ మనో వీధిలో మెరిశారు.

మామ్మ వయసూ, రామదాసు దినచర్యా, అమ్మ ఉబ్బసమూ, అన్నయ్య సంసారమూ గుర్తుకొచ్చినై. దొడ్డి తలుపు తెరుచుకుని పెరట్లోకి వచ్చింది.

రాత్రి చల్లగా వుంది. వెన్నెల కురుస్తోంది. పారిజాతం పూలని రాలుస్తోంది. పరిమళాల్ని పరుస్తోంది. కమ్మతెమ్మెర సోకింది.

ఒక్కసారిగా మనోనేత్రం తెరుచుకున్నట్లయింది ఇందిరకు "జీవితం ఏమిటి?" ప్రశ్నకు సమాధానం దొరికింది ఆమెకు. అది-ప్రమీల 'అక్షరం'. అది-శేఖర్ వ్యక్తిత్వం! అది బిందువులో సింధువుని వీక్షించడం! వాయు తరంగంలా కదిలింది ఇందిర!!

$0_0 0$